# అభిమాన పుస్తకం



రావి కొండలరావు

మౌంట్ రోడ్డులోవున్న బుక్ షాపులో అరగంట సేపట్నుంచీ ప్రదక్షిణాలు చేస్తున్న జోగారావుకు కొద్దిగా ఆకలివేసి నట్టు తోచింది. పొట్టమీద ఓసారి చేత్తో రాసుకున్నాడు. ఫూ—ఆకలికేం—దాని వేళ ఐయ్యేప్పటికి అది సిద్ధపడిపోతుంది!

జోగారావు ప్రదక్షిణాలు మళ్ళీ ప్రారంభించాడు. ఈ పుస్తకాలన్నీ ఒక్కసారిగా చదివేయాలన్నంత కోరిక కలిగింది. ఐతే, ప్రస్తుతానికి అట్టలు చదువుతూ తృప్తి పడ్డాడు! 'చాలా సేపయింది, ఇక బయట పడదామా' అనిపించి, నూటఒకటో ప్రదక్షిణం పూర్తిచేసేదామన్నట్టుగా కాలు కదిపాడు. ఇంతసేపూ తనకు కనిపించక, దాక్కొనివున్న తన 'అభిమాన రచయిత' గారి పుస్తకం ఛటాలున జోగారావు కంటపడ్డది. ఆగి-పుస్తకంబయటకులాగి-'జన్మతరించింది' అనుకున్నాడు. ఈ పుస్తకం కోసం ఎన్నాళ్ళగా తను తపస్సు చేస్తున్నాడో లెఖ వేసుకున్నాడు. భేష్! పేజీలన్నీ ఒక్కసారి ఆ చివర్నుంచి ఈ చివరకు తిరగవేస్తూ అక్కడక్కడ కొంత కొంత చదివాడు' కాస్సేపటికి ఈ పుస్తకం తనది కాదన్న సంగతి తెలుసుకుని, అటూ యిటూ చూసి తను బుక్ షాపులో పుస్తకాల మధ్య వున్నట్టు తేల్చుకున్నాడు జోగారావు. ఈ పుస్తకం కాపీలు ఇంకా ఎన్నివున్నయోనని అక్కడ చూశాడు—ఇంకేమీ కనిపించలేదు. ఇదికొనటం ఎట్లా అని ఆలోచిస్తూనే దాన్ని దాని స్థానంలో వుంచేసి, నిట్టూర్చి దానికేసే చూస్తూ ప్రేయసిని వదిలివెళ్లుతున్న ప్రియుడిలాగా మొహం పెట్టి బయటకు నడిచాడు!

జోగారావుకు ఆకలి మళ్ళీవేసింది. నెలాఖరు రోజులు—భోజనపుటిక్కెట్ల పుస్తకం మూడురోజుల క్రిందటే ఆఖరయిపోయింది రోజుకు మూడేసిసార్లు తిన్నాడని కాదు—అతిథులపట్ల జోగారావు చూపించిన అమిత ఆదరణవల్ల! ఇంకా మూడునాలుగు రోజులు గడిపితేగాని ఆ ఒకటో తేదిరాదు—ఒకటో తేదిదాటి రెండు మూడు రోజులయితేనే గాని ఆ జీతంరాదు! జోగారావు చెయ్యి జేబులోకి పోనిచ్చి పాత ఉత్తరం ఒకటి లాగాడు. ఆ మడతలో మూడగా అతనికి మూడు రూపాయినోట్లు కనిపించినై. ఈ మూడు నోట్లతోనూ, మిగిలినకాస్త చిల్లరతోనూ వారంరోజులు ఎట్లా గడపటమో అతని వూహకందలేదు!

జోగారావుకు పుస్తకాలమీద అమిత గౌరవం. గౌరవం అనేఏమిటి-కొన్ని కొన్ని పుస్తకాలంటే అతనిభాషలో "చచ్చిపోతాడు!" ఈరోజు తను చచ్చిపోవాల్సిన ఈ పుస్తకం కనిపించింది కాబట్టి ఇకచావక తప్పదనుకున్నాడు. ఈ పుస్తకంకోసం జోగారావు ఆరేళ్లుగా బాధపడుతున్నాడు. ఎంత మందినో అడిగాడు—ఎన్ని గ్రంథాలయాలలో తిరిగేశాడు—ఎన్ని పుస్తకాల షాపుల్లోనో ప్రదక్షిణలు చేశాడు—ఐతే ఎంచాతో ఇన్నాళ్లుగా అతని కంటబడని పుస్తకం ఇవాళ కనిపించింది. పదిరోజుల క్రిందట అడిగితే షాపువాళ్లు లేదన్నారు. ఈలోగా వచ్చిందన్నమాట!

మౌంటురోడ్డులో కార్లూ బస్సులూ హడావుడిగా తిరుగుతున్నై. పెద్ద పెద్ద 'క్యూ'లలో నించుని త్వరత్వరగా బస్సుల్లో ఎక్కేస్తున్నారు జనం! జోగారావుకు నవ్వొచ్చింది. "వీళ్ళందరికీ ఏమిటో ఇంత అర్జంటు పన్లు?" అనుకున్నాడు. ఆకారు నడుపుతున్న మనిషికి ఏంపనో తెలీదుగాని, అరనై మైళ్ళఘాటిలో పరుగెత్తి పారిపోతున్నాడు! ఏమయితే నేం - తనకుమాత్రం అర్జంటు వ్యవహారాలేమీ లేవు—అందుకు తను అదృష్టవంతుడు!

ఇంతసేపూ యీ బస్సుల గోలలో జోగా

రావుకు ఆత్మారాముడి ఏడుపు వినిపించలేదు. ఈ ఆత్మారాముడు గాడు "అహో లక్ష్మణా!" అని పలకరించి, హోటల్లో వేసేవటం జోగారావు చెవులారా విన్నాడు. వాడు 'అన్నమో రామచంద్రా' అన్నట్టు లేదుగాని, 'కాఫీ యో జోగారావూ' అన్నటుగా అనిపించి, హోటల్లో దూరి, కాస్త టిఫినూ కాఫీ సేవించి చెయ్యి తుడుచుకోటానికి రుమాలు కోసం జేబులు తడిమాడు- లేదు! తడిచేతిని పాంటు జేబులోకి ఒక్కసారి పోనిచ్చి ఆ జేబులోనే 'తడి'ని తుడిచేసుకుని బయటపడ్డాడు!

మళ్ళీ జోగారావుకు ఆ పుస్తకం గుర్తొచ్చింది. దాన్ని విడిచిపెట్టి ఎక్కడికి పోవటమో అతనికి అర్థం కాలేదు. ఇన్నేళ్ళుగా తను చేసిన తపస్సు ఫలించినా—ఫలితాన్ని పొందటానికి కొంత ఖర్చు చెయ్యాలి. ఆ పుస్తకం ఖరీదు ఎంతో ఏం చావో! పోనీ వచ్చే నెల డబ్బు రాగానే కొందామనుకున్నాడు. ఐతే అంతవరకూ అక్కడే అది తనకోసం కాచుకుని కూచుంటుందని నమ్మకం ఏమిటి?—ఈలోగా ఎవడన్నా కొనేయొచ్చు. 'నేను దాన్ని కొంటాను అంతవరకూ ఉంచ'మని చెప్పేసి రానా—అనుకున్నాడు. పుస్తకాలవాడు ఏం నవ్వుకుంటాడో!

జోగారావుకు కాలు ఎటూ కదలటం లేదు. ఈ పుస్తకం ఖరీదు రూపాయిన్నరో రెండో వుంటుంది. పోనీ, కొనేద్దామా అంటే వారం రోజులు తను హోటలు గుమ్మం ఎక్కటానికన్నా నోచుకోడు!

అరగంటసేపు అక్కడే నించుని ఆలోచించాడు. ఐతే ఐంది- కొనేద్దాం! ఈ రోజుకు కాస్త చిల్లర మిగుల్తుంది కదా-రేపు తెల్లవారే లేచి ఎవడి జేబన్నా వెదకవచ్చు! ...ఎవడిస్తాడు- అందరికీ నెలాఖరేగా అని మళ్ళీ అనిపించింది. నెలాఖరయితే మాత్రం ఆ మాత్రం ఒకటో రెండో దగర పెట్టుకోకుండా వుంటాడా ఎవడైనా! ఈ మధ్య చాలా రోజులుగా తను ఎవరి దగ్గరా అప్పు తీసుకోలేదు- అది ఇప్పుడు పనికిరావొచ్చు!

బుక్ సెంటర్ లోకి మళ్ళీ ప్రవేశించి, ఆ పుస్తకాన్ని నెమ్మదిగా బయటకు తీసి "ఎంతకి?" అని కనుక్కున్నాడు అక్కడున్న షాపు అతన్ని.

"మూడూ పన్నెండణాలు"

జోగారావు చెయ్యి యంత్రంలాగా పని చేసింది. ఛటాలున ఆ పుస్తకాన్ని ఆ స్థానంలో వుంచేసింది! మారుమాట చెప్పకుండా బయట పడ్డాడు జోగారావు. వీడి తస్సాదియ్యా-మూడూ పన్నెండణాలా! తన దగ్గర వున్న మొత్తం అంతా కలిపినా అంత వుండదే! తెగించి కొందామని వెళ్ళినా.

ఇదేం ఖర్మ ఇట్లా పరిణమించింది! కానీ- 'ప్రాప్తం' అనేది వుండాలని సర్ది చెప్పుకుని ఇంటికేసి నడిచాడు జోగారావు.

ఏమిటో అతని మనస్సు ఇంకా ఆ పుస్తకం మీదే వున్నది. ఎంత తప్పించుకుందామన్నా తప్పటం లేదు. ఎట్లాగన్నా కొనెయ్యాలి—ఈ రాత్రి చదివెయ్యాలి—అప్పుడు గాని నిద్రపోరాదు!

జోగారావు ఇంటికి చేరుకుని 'అప్పుడే వచ్చానా' అనుకుని ఆలోచించాడు. తన పరధ్యానం వల్ల దారిలో నాలుగు బస్సులూ రెండు కార్లూ తనను తొక్కెయ్యాలని ప్రయత్నించి, తీరా దగ్గరకొచ్చి భయపడి అమాంతం ఆగిపోయేవి- అవి చేసిన 'ధ్వని' వల్ల తను మళ్లీ ఈ లోకంలో పడుతూ తప్పించుకుంటూ 'పేవ్ మెంటు' ఎక్కుతూ వచ్చాడు! తనను తొక్కెయ్యాలని పెద్ద పెద్ద బస్సులే ప్రయత్నించినై—ఇదొక లెఖ! అనుకున్నాడు. ఐనా తను దారంతా ఇంత పరధ్యానంగా వుండటానికి కారణం ఆ పుస్తకమే! ఇదేదో తనను వొదిలేట్టు లేదు!

బట్టలన్నా మార్చుకోకుండా అట్లాగే క్రిందనే విశ్రమించాడు. అతనికి ఏమీ తోచటం లేదు. ఎంత వూరుకుందామన్నా ఆ పుస్తకమూ—ఆ రచయితా అతని దృష్టిని తప్పించలేకుండా వున్నారు.

ఏదో ఆలోచించి జోగారావు ఛటాలున లేచాడు. తారు రోడ్డుమీద నడకవల్ల అరిగిపోయి, మధ్యన రూపాయంత రంధ్రంతో శోభిల్లుతున్న చవకరకం చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు. వెధవది! ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాడు తను కొత్త చెప్పులు కొనుక్కోవాలని. సరే- ఇప్పుడేనా ఏమిటి ఈ వూహకూడా! వెధవ చెప్పులు ఎప్పుడు కొనుక్కుంటే కాదు- తను చదవాల్సిన పుస్తకం కొనటానికే డబ్బులు లేక బాధపడుతూంటే చెప్పుల కొచ్చింది తొందర!

చెప్పు మధ్య వృత్తాకారాన్ని పెంచుకుంటూ దడదడా నడుస్తూ-పావుగంటలో ఒక ఇల్లు చేరుకుని జోగారావు తలుపు తట్టాడు. "ఎవరు?" అన్నది లోపల్నుంచి ఒక కంఠం.

"విశ్వనాథం వున్నాడా అండీ?" అన్నాడు జోగారావు.

"వున్నాడు రండి" అన్నది గొంతు.

జోగారావు లోపలకు ప్రవేశించి విశ్వనాథాన్ని కలుసుకున్నాడు.

"ఏమిట్రా ఎండలో వచ్చావ్? కూచో" అన్నాడు విశ్వనాథం.

"కూచోటానికి టైమ్ లేదురా, నీతో అర్జెంటుగా మాట్లాడాలి."

మాట్లాడమన్నాడు విశ్వనాథం. తనకు అత్యవసరంగా కనీసం రెండు రూపాయలన్నా కావాలనీ, జీతం రాగానే వెంటనే తీర్చేస్తాననీ, ఇంకెప్పుడూ ఇట్లా హఠాత్తుగా వచ్చి డబ్బు అడగననీ ప్రాధేయపడ్డాడు జోగారావు.

"రెండు రూపాయలే!" అని ఆశ్చర్యపడ్డాడు విశ్వనాథం.

"బాబ్బాబూ ... నీ పుణ్యం వుంటుంది" అని బతిమాలాడు జోగారావు. పది నిమిషాలు ఆలోచించి, ఒక రూపాయి నోటూ ఇంకో రూపాయి చిల్లరా కలిపి తెచ్చి జోగారావు చేతిలో పోసి "సాధ్యమయినంత త్వరగా ఇస్తే కృతజ్ఞుణ్ణి!" అన్నాడు ఆపద్బాంధవుడు. దానికి సమాధానం చెప్పే స్థితిలో లేని జోగారావు ఆ డబ్బులు లెఖన్నా చూసుకోకుండా, చెప్పుల్లో కాళ్లు దూర్చి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బుక్ షాపులో పడ్డాడు. ఈలోగా దాన్ని ఎవడన్నా కొనేశాడేమోనని షాపులోకి అడుగు పెడుతూనే ఆ స్థానంలోకి చూశాడు. అదక్కడే వున్నది! దివ్యమైన భవంతులు నాలుగూ,


# అతిమూత్రవ్యాధి
# నెమ్మదించును

మూత్రంలో చక్కెర పోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు అరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి వీనస్ ధారమ్ అనేక వంవత్సరముల పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది దీన్ని వాడటంవల్ల వేనకు వేల మంది మృత్యుముఖమునుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజు నుండే మూత్రంలో చక్కెర తగ్గించి. అత్యధిక మూత్రం కూడా నివారిస్తుంది మూడు రోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యం లేదు. ఇన్ జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.
ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory (A.P.W)
P. O. Box No. 587, Calcutta.

# ★ అభిమానపుస్తకం ★

పాతిక ఎకరాల భూమి దానం పుచ్చుకుంటున్నంత సంతోషంగా ఆ పుస్తకాన్ని కొని, జాగర్తగా అట్ట తిరగేసి, ఆ కాయితం వదిలి మరో కాయితం తిప్పి జేబులోంచి కలంతీసి నీటుగా తన పేరు అక్కడ రాసుకుని, దానికేసి ఆప్యాయంగా చూస్తూనే తన కలాన్ని జేబులో పెట్టుకుని, సగర్వంగా పుస్తకాన్ని రెండు చేతులతోనూ గుండెలకు హత్తుకుని రాజ్యాలను జయించిన మహారాజుకు మల్లే ఠీవిగా అడుగులు వేస్తూ బుక్ షాపు దాటి బయటకొచ్చాడు జోగారావు! ఇహ అతనికి ఈ ప్రపంచంతో నిమిత్తంలేదు - ఈ కార్లూ బస్సులూ ఎక్కడకు పోయినా అతనికి అవసరం లేదు-ఆరేళ్లుగా కావాలనుకుంటూ తపించుకుపోతున్న పుస్తకం ఇవాళ అతని చేతిలోపడది. అది అతని స్వంతం-చేతులారా డబ్బుపోసి అతను కొనుక్కున్న వజ్రాలహారం!

ఆ పుస్తకం ఎంత త్వరగా చదివేయటమా అని జోగారావు తహతహలాడాడు. చదివేయటమేకాదు-దిన్ని జాగర్తగా బీరువాలో పెట్టి తాళంవేసి, ఆ తాళంచెవి భద్రంగా మొలలో దోపుకోవాలి!

చరచరా నడుస్తూ ఇంటికేసిపోతున్న జోగారావుకు ఓ ప్రాణస్నేహితుడు ఎదురై పలకరించాడు—

"ఎక్కణ్ణుంచోయ్?" అనే ధోరణిలో కళ్ళెగరేస్తూ.

"పుస్తకాల షాపునుంచిలే" అన్నాడు జోగారావు సగర్వంగా.

"ఏదో కొన్నట్టున్నావే—ఏదీ?" అని తీసుకుని చూశాడు స్నేహితుడు.

"జాగర్త—కొత్తపుస్తకం!" అని హెచ్చరిస్తూనే తన కష్టార్జితాన్ని అతని చేతిలో పెట్టాడు.

అరెరే—ఈ పుస్తకం వుందన్న మాట" ఎన్నాళ్లనుంచో దీనికోసం చూస్తున్నాను!

"నువ్వూనా?" అన్నాడు జోగారావు.

"ఏం—నేను కాకపోతే ఇంకెవరు?... సరేగాని నువ్వుకొనేశావా?"

"ఆహా!"

"ఏమీ అనుకోకు-ఆడబ్బిచ్చేస్తాను నాకిచ్చెద్దూ"

"నేనే ఇవ్వటం ఏమిటి—ఆ డబ్బిస్తే ఆ షాపువాడే ఇస్తాడు—బిల్లు కూడా మరీ రాసి!"

"సరేలే...బిల్లు ఎవడికి కావాలి గాని చదివేశావా?"

"ఇప్పుడింకా కొంటున్నానయ్యా — తాజా సరుకు. వస్తువు చూడగా తెలియటంలా?" అన్నాడు జోగారావు సంతోషంగా.

"ఒక్క విషయం ... ఏమీ అనుకోకు" అని నణగటం మొదలెట్టాడు ప్రాణ స్నేహితుడు.

"ఏమిటి"?

"నేను రేపు పొద్దున్నే వూరెళ్ళుతున్నాను."

"మీ వూరా?"

"మా వూరే. మళ్లా నెలకుగాని రాను. అంచాత...నే చెప్పేదంతా విను. నాకీ పుస్తకం మీద ఇంతా అంతా అభిమానం కాదు. దీనికోసం చాలా శ్రమపడ్డాను. అటువంటిది ఈ నాడు నా ప్రాణస్నేహితుడి దగ్గర లభించింది. ఇది నీ స్వంత పుస్తకం. ఎప్పుడయినా నువ్వు చదువుకుంటావు నువ్వు నన్ను పూర్తిగా నమ్ము. ఇప్పుడిది నా కిచ్చావంటే, ఈ రాత్రిలోగా చదివేసి పొద్దున్నే బండెక్కిపోతాను. నేను మళ్లీ వచ్చాక పోనీ చదువుకుందామంటే నేను వుండలేను. ఈ క్షణానే చదివేద్దామన్నంత కోరిక కలుగుతోంది. నువ్వు పొద్దున్నే నా రూముకు వచ్చావంటే, ఈ రాత్రిలోగా చదివేసి నా రూమ్ మేట్ చలపతికి అప్పగించి జాగర్తగా నీ కిచ్చేయమని చెబుతాను. లేదూ-మీయింటికే తీసుకొచ్చి అతను ఇచ్చేస్తాడు. నెల్లాళ్లపాటు నేను హాయిగా వుంటాను. కాదనకు!" అని దీనంగా ఉపన్యాసం ఇచ్చాడు ప్రాణస్నేహితుడు. ఈ ఉపన్యాసం విన్నాక జోగారావుకు మాట రాలేదు. తను ఇంకా పుస్తకం కొంటున్నాడు - పేరురాసిన ఆ సిరాతడి ఇంకా ఆరనేలేదు-అప్పుడే ఎరువా?—

"నేను చదవాలి" అన్నాడు జోగారావు మొండిగా.

"చదవొద్దని నేనన్నానా? చదువు. నేను వెళ్ళిపోతున్నాను గదయ్యా - నువ్వెట్లా ఇచ్చావో అట్లాగే తెల్లారేసరికి నీ చేతిలో నీ పుస్తకం వుంటుంది. నా మాటమీద ఆ మాత్రం నమ్మకం వుంచు. బాబ్బాబూ... నువ్వే దీని యజమానివోయి!"

జోగారావు సందిగ్ధంలో పడ్డాడు. కొత్త పుస్తకాన్ని తనింకా చదవనిదాన్ని అసలు ఇట్లా అడగటానికి ఈ స్నేహితుడికి మొహమాటం ఎందుకడ్డలేదోనని వూహించసాగాడు. అదిగాక, ఈ పుస్తకాలతో వున్న చిక్కేయిది! పుస్తకం ఇవ్వకపోతే "పుస్తకానికే ఇంత ఇదయిపోతావా" అనేస్తారు. ఇస్తే అది తిరిగిరాదు! ఇట్లా తన పుస్తకాలు ఎన్ని పరహస్తాల్లో గతించిపోయినవో లెఖలేదు. వాటితోపాటు ఇది పోతేనో! అమ్మయ్యో!

"నేనివ్వను!" అన్నాడు జోగారావు ఏమవుతుందో చూదామని.

"ఇవ్వకపోతే ఈ నెలంతా నేను ఊసూరని ఏడవాలి. నీ పుణ్యాం వుంటుంది. మరి అంతమనిషిని నమ్మవేం?...నాలుగైదు నెలల కిందట ఐదు రూపాయలు కావాలనీ నాలుగు రోజుల్లో ఇస్తాననీ అంటే నేను నీకు ఇచ్చాను కానూ? నిన్ను నమ్మి ఇచ్చానంటావా? నమ్మకం వుండాలోయ్ బ్రదర్...నీకేం భయంలేదు. అది తెల్లారేప్పటికి నీ చేతిలో వుంటుంది." అని అంటూనే జోగారావు చేతిలోంచి ఆ పుస్తకాన్ని తీసుకున్నాడు. జోగారావు ఇక అడ్డుపెట్టలేక పోయినాడు. ఆనాటి ఐదురూపాయలలో ఈ పుస్తకాన్ని ముడిపెట్టగానే అతనికి మనస్సులో అదోలా




అనిపించింది. ఇంతలో వుంటారు ఈ స్నేహితులు!

"రేపు పొద్దున్న నీ రూమ్‌కే వచ్చి తీసుకుంటాను. చలపతితో చెప్పు. అతని చాతనువ్వేం పంపనక్కర్లేదులే!" అన్నా జోగారావు నిరుత్సాహంగా.

"థాంక్స్. మరేం అనుకోకు. పుస్తకం మీద మమకారం అటువంటిది!"

పుస్తకాన్ని తీసుకొని ప్రాణస్నేహితుడు పోతూంటే జోగారావు ఏడుపు మొహం పెట్టాడు. ఆనాడు సత్యవంతుడి ప్రాణాలు యముడు తీసుకు పోతున్నప్పుడు, సావిత్రి మొహంలో కనిపించిన దీనత్వం, వ్యథ ఈనాడు జోగారావులో మళ్లీ కనిపించినై!

జోగారావుకు ఒళ్ళు కంపరమెత్తింది. ఎండలో బయల్దేరి, వాడిప్రాణంతీసి డబ్బు పుచ్చుకుని మోజుపడి ఆప్యాయంగా ఈ పుస్తకం కొనుక్కుంటే - వీడెవడో దారిలో సైంధవుడల్లే అడ్డుపడి తన చేతుల్లోంచి లాక్కుపోతాడా? వాడికేమిటా హక్కు గానిమీద? ఐతే తనెందుకు కొనుక్కున్నట్టు?... అతని మొహంబాగా ఎరుపెక్కింది. ప్రాణస్నేహితుడు వెళ్లేదారికేసే తీవ్రంగా చూస్తూ, "ఆ పుస్తకం నాది— నేనివ్వను!" అని గట్టిగా అరిచాడు. బస్సులూ కార్ల ధ్వనిలో ఆమాట ఎవరికీ వినపించలేదు. వినిపించుకోవాల్సిన ఆ ప్రాణస్నేహితుడు ఎటువెళ్లిపోయాడో జాడకూడా కనిపించలేదు!

రాత్రంతా జోగారావు పుస్తకం గురించే బాధపడ్డాడు. గభాలున పక్కమీదలేచి కూచుని "నాపుస్తకం నేను చదవకుండా వాడెవడో తీసుకుపోవటం ఏమిటి?" అనుకున్నాడు. అతనికి పక్కనిండా తేళ్ళూ పాములూ ప్రాకుతున్నట్టు అనిపించింది. ఈ రాత్రేవెళ్లి తనపుస్తకం తెచ్చేసుకుంటేనో! ఐదునిమిషాలపాటు అట్లాబాధపడి చివరకు "ఖర్మ" అని నుదటిమీద కొట్టుకుని, దభీమనిపడి నిద్రపోయాడు జోగారావు!

తెల్లవారింది. రోజూకంటె ఈరోజు ముందేలేచాడు. కాలకృత్యాలు కూడా త్వరగానే ముగించుకుని, కాస్తకాఫీతాగి బయల్దేరాడు జోగారావు తనపుస్తకంకోసం. దారిపొడుగునా ఈ స్నేహితులమీదా, వాళ్లు పుస్తకాలు అడిగే తీరుమీదా అతను విరుచుకు పడ్డాడు!

"చలపతీ!" అన్నాడు జోగారావు ఒక యింటిముందు నించుని.

"ఎవరది?" అన్నాడు చలపతి లోపల్నుంచి.

"నేను జోగారావును"

రమ్మని ఆహ్వానించాడు చలపతి.

జోగారావు లోపలకు ప్రవేశించేసరికి చలపతి కుర్చీలోపడుకుని తనపుస్తకమే చదువుతున్నాడు.

"ఏం జోగారావ్— తెల్లవారేసరికి దిగావే— ఏంసంగతి?" అన్నాడు చలపతి.

ఏం సంగతంటాడేమిటి వీడిమొహం—. వాడి బాబుగారి సొమ్మల్లే తన పుస్తకాన్ని అనుభవిస్తూ!

"ఆ పుస్తకం నాది!" అన్నాడు జోగారావు.

"నీదా?...ఆఁఆఁ...అవును చెప్పాడు. కాని-చాలా ఇంటరెస్టింగ్ గా వుంది సుమా! అరవై పేజీలు చదివేశాను. ఎంతలే— ఐపోతుంది. ఇచ్చేస్తాను...దీనికోసం నువ్వు తెల్లవారే సరికి వొస్తావు అనుకోలేదు!" అని సమాధానం కోసమన్నా ఎదురుచూడకుండా పుస్తకంలో పడ్డాడు చలపతి.

జోగారావుకు మంట పుట్టింది. పెద్ద తెలిసినట్టు ప్రతీవాడూ సాహిత్యప్రియుడే ఐపోతాడు. ఇంకోడి పుస్తకం తేరగా దొరికే సరికి!

"నా పుస్తకం అది. నేనింకా చదవలేదు. నాకిచ్చేయ్ పోతాను" అన్నాడు జోగారావు.

"బావుందోయ్. మధ్యలో వుంటే ఇచ్చేయ మంటావేం— కాస్సేపుకూచో... చదివేస్తాను"

హరి వీడి తెగింపు మండిపోనూ! ఏమిటీ అధికారం

"ఇపుడు కూచోను. నాకు అవతల ఆఫీసుంది. పోవాలి" అన్నాడు జోగారావు స్థాయి మార్చి.

"ఇచ్చేస్తానంటూ వుంటే మరీ ఇదయిపోతా వేమిటయ్యా— ఐపోయిందుండు!" అన్నాడు చలపతి కృతి హెచ్చించి. జోగారావు ఈ అవమానాన్ని భరించలేక, ప్రాణస్నేహితుణ్ణీ ఈ చలపతినీ మనసారా మదిలో తిట్టుకున్నాడు! ఇక చేసేదిలేక—

"సాయంత్రం వొస్తాను. పూర్తి చేసేసి ఇచ్చేయ్" అన్నాడు జోగారావు మందర స్థాయిలో.

"ఓయస్. ఆమాత్రం ఓపుండాలిగాని, నిర్మొగమాటంగా 'ఇచ్చేయ్' అని అడిగేస్తే మేమంతా ఏమైపోవాలి?" అన్నాడు చలపతి ఇంకా తక్కువ స్థాయిలో.

ఇంకోక్షణంకూడా జోగారావు అక్కడ నించోలేదు. తన కోపాన్నంతా ఏమీ ఎరగని భూమ్మీద ప్రయోగిస్తూ చరచరా బయటకు నడిచాడు!

ఆ సాయంత్రం ఆఫీసు ఐన తర్వాత జోగారావు చలపతిని కలుసుకోలేకపోయాడు ఏదో అవాంతరం వచ్చి. రాత్రి వెళ్దామా అంటే వొళ్లంతా నొప్పిగావుండటం వల్ల బద్ధకం ఆవరించి, ఎనిమిదింటికే నడుం వాల్చేశాడు.

మర్నాడు ఉదయం జోగారావు మళ్లీ చలపతి గుమ్మం ఎక్కేసరికి తలుపు తాళం వేసివున్నది! పావుగంటసేపు బయటనించుని ఆఫీసూ, అధికారీ గుర్తొచ్చి చలపతిని నానా మాటలూ అనుకుంటూ వెళ్లిపోయినాడు!

చీకటి పడేవేళకు ఆఫీసునుంచి జోగారావు తిరిగివచ్చేస్తూవుంటే చలపతే ఎదురై పలకరించాడు. "పుస్తకం కాదయ్యా అది. ఓహోహో!" అని మెచ్చుకున్నాడు చలపతి.

"ఏదీ?-పొద్దున్నుంచి నీకోసం తిరుగుతూ నేవున్నాను" అన్నాడు జోగారావు.

"అవునుగాని - నిన్న సాయంత్రం వస్తానన్నావు రాలేదేం? నీకోసం ఎటూ వెళ్ళక ఇంట్లోనే కూచున్నాను."

"రాలేక పోయాను. సరే, పద పుస్తకం తీసుకుంటాను" అన్నాడు జోగారావు చలపతిని వెనక్కి తిప్పుతూ.

"సారీ జోగారావ —నిన్నరాత్రి వెంకటేశ్వర్లు నా రూమ్‌కు వచ్చాడు. వెంకటేశ్వర్లు నీకు తెలుసుగదూ?.. వాడు ఎంత చెబుతున్నా వినిపించుకోక, మళ్లీ ఇచ్చేస్తానని ఆ పుస్తకం తీసుకెళ్ళి—" అంతే!


పండిత డి. గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయ రోగనివారిణి

ఆయుర్వేదాశ్రమం,

(ప్రైవేటు) లిమిటెడ్., మద్రాసు-17.

# ★ అభిమానపుస్తకం ★

జోగారావుకు మిగతా వాక్యం వినిపించ లేదు. రెండు చెవుల్లోనూ హోరున గాలి వీచింది—కళ్ళు రెండూ బైర్లు కమ్మినై. మూర్ఛ వచ్చినంతపనై, తేరుకుని "నన్ను మరి చదవనివ్వరా?" అని అరిచాడు జోగారావు ఆ రోషంమీద.

"ఏం శెయ్యమంటావయ్యా — వాడు వద్దంటున్నా వినిపించుకోక తీసుకు పోతేనూ?"

"ఊరి పెట్టుకోండి. బాగా దొరికారు. ఎవడిచ్చాడు నా పుస్తకంమీద మీకీ అధికారం? .. మీకు మతులు లేవూ?—మీ పుస్తకం ఐతే మీకు బాధ కలగదూ?" అంటూ జోగారావు అరవసాగాడు. ఈ అరుపులు విని జోగారావుకు పిచ్చెక్కిందని, ఆ పేవ్‌మెంటుకు అతన్ని విడిచిపెటి తన దారిన తాను పారిపోయాడు చలపతి! వెంకటేశ్వర్లు పచ్చి పుస్తకాల దొంగ! వాడి చేతుల్లో పడిందా? ..జోగారావుకు తల తిరిగిపోయింది — వెంకటేశ్వర్లు ఇంటివేపు దారి తీశాడు!

* * *

ఒకానొక మధ్యాహ్నం మండుటెండలో కాగిపోతూ, జోగారావు పేవ్‌మెంటు మీద బస్సుకోసం నించున్నాడు. ఆకలి దహించుకు పోతున్నది. జేబులో చెయ్యిపెట్టగా కొద్దిపాటి చిల్లర కనిపించింది. ఇంకా మూడు నాలుగురోజులు గడిచితేగాని, ఒకటో తేదిరాదు - ఒకటో తేదీ దాటి రెండుమూడు రోజులయితేనే గాని ఆ జీతంరాదు: ఈ పూటకు కాఫీమానేసి ఏకంగా రాత్రికే చూసుకుందాం అనుకున్నాడు. సగం తినగా మిగిలిన వక్కపొట్లం తీసి మిగిలిన సగాన్నీ "టిఫిన్"తిని, బస్సుకోసం చూడటంలో నిమగ్నుడయ్యాడు. ఎండ పేలుస్తున్నది. మొహం ఎగాపెక్కి, వొళ్ళంతా చెమట ముద్దయిపోతున్నది!

ఈ నెలరోజుల్లోనూ జోగారావు తన స్వంత పుస్తకాన్ని చదవనే లేదు. అది చలపతి దగ్గర్నుంచి వెంకటేశ్వర్లుదగ్గరకు వెళ్ళిన తర్వాత నరసింహమూర్తి దగ్గరకు ప్రయాణం చేసింది. నరసింహమూర్తి దగ్గర్నుంచీ శివరావుకూ, అక్కడనుంచి హనుమంతరావుకూ, ఆ తర్వాత వాడి బావమరిదికీ వాడి చేతుల్లోంచి ఎవడో వాడి స్నేహితుడి పెద్ద నాన్నగారి కుమారరత్నం చేతుల్లోకి అట్లా ప్రయాణం సాగించింది ఆ పుస్తకం! ఈ అందర్నీ ఎరుగున్నా ఎరక్కపోయినా వీళ్ళందరి గుమ్మాలూ జోగారావు ఎక్కుతూ దిగుతూవచ్చాడు. ఈఎక్కి దిగటాల్లో అతని చెప్పు మధ్యరంధ్రం బాగా పెరిగిపోయి ఒడ్డు దాటేసింది! ఆ పాదరక్షల అవశేషాలు రెండూ జోగారావు గుమ్మం ముంగువారం రోజులై కాపలాకాస్తున్నై - రాను రాను అతని మనస్సు రాయిగా మారిపోయింది. పుస్తకాన్ని తల్చుకుని శోకపరితప్త హృదయంతో బాధపడేకంటే, పూరుకోవటమే మేలనిపించింది. కాని వుండి వుండి ఆపుస్తకం మనసులో మెరుపులా క్షోభ కలిగిస్తూనే వున్నది!

ఈ బస్సుకోసం జోగారావు ఇక నిరీక్షించ లేకపోయాడు. చెప్పులు లేని కాళ్ళతో ఈ ఎండలో నడిచి వెళ్ళటం దుర్భరం అని మళ్లీ అనిపించింది. 'కానీ-ఈ నీడ పట్టునే కాసేపు నించుందాం,' అని పేవ్‌మెంటు వెనక్కుపోయి నించున్నాడు.

ఆ పేవ్‌మెంటుమీదే పాతపుస్తకాలు ముందు పెట్టుకుని అమ్ముకుంటున్న కుర్రాడి వేపు జోగారావుచూసి, జాలిపడి, ఏదన్నా కొందామా అని దగ్గరకుపోయి వున్న పుస్తకాలను పరీక్షగా చూడసాగాడు. ఛటాలున అతని చెయ్యి ఒక పుస్తకం మీదకు పోయి దాన్ని తీసింది ఆనాడు తను బుక్ షాపులో కొన్న తన అభిమాన పుస్తకంయొక్క ప్రతి! కాని, ఇది బాగా నలిగిపోయి, అట్టలు వూడిపోయి వున్నది. ఐతే ఐంది - ఇదన్నా చదువుకుందామని—

"ఎంత?" అన్నాడు జోగారావు ఆత్రుతగా.

"ఎట్టణా సార్!" అన్నాడు వాడు.

"ఇంద-నాలుగు అణాలు తీసుకో!" అని వాడిచేతిలో ఒక పావలా కాసు పడేశాడు జోగారావు. ఈ పుస్తకాన్నన్నా ఎవడికీ చూపించకుండా దాచేసుకుని, తలుపులు వేసుకుని గదిలో కూచుని చదివెయ్యాలని అతను ఉద్దేశించాడు!

రెండడుగులు ముందుకు వేసి, మాసిపోయి నలిగి నలిగి. చిరగటానికి సిద్ధంగావున్న ఆ పుస్తకం మొదటికాయితం తిరిగేశాడు. సరిగ్గా నెల్లాళ్ళ క్రిందట బుక్ సెంటర్‌లో కష్టపడి తను ఓ పుస్తకం కొని, ఆప్యాయంగా కలంతీసి తన స్వంతపుస్తకం అనే భావనతో సగర్వంగా రాసుకున్న తనపేరు ఆ రెండోకాయితం పై భాగంలో వెలవెలబోతూ కనిపించి, జోగారావుకేసి చూసి నిరసంగా నవ్వింది! ★

మనోహరమైన కేశములకు సులభమైన కిటుకు
తాతావారి
సుగంధిత కొబ్బరి తలనూనె
మరియు షాంపూ

